మృగశిర సందడి..

మృగశిర కార్తె గురువారం ప్రారంభం కావడంతో చేపల దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా తెల్లవారు జామునుంచే మత్స్యకారులు చెరువుల్లో చేపలు పడుతుండటంతో జనాలు చెరువుల వద్ద బారులుదీరి కొనుగోలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి చేపలు తీసుకొచ్చి వ్యాపారులు రోడ్ల వెంట ప్రత్యేక టెంట్లలో, గ్రామాల్లో వాహనాల మీద వచ్చి చేపలను అమ్మకాలు జరిపారు. పలు చోట్ల స్టాళ్లు ఏర్పాటు చేసి చేపల పులుసును విక్రయించారు. రేటు ఎలా ఉన్నా ప్రజలు మాత్రం చేపలను కొనేందుకు ఎగబడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్


సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం సంతలో చేపల విక్రయాలు..


టేకులపల్లి: పట్టిన చేపలను తీసుకొస్తున్న మత్స్యకారులు


సింగరేణి(కొత్తగూడెం): చేపల కోసం బారులు


కొత్తగూడెంలో చేపల పులుసు స్టాల్


జూలూరుపాడులో..


పాల్వంచలో చేపల విక్రయాలు..

క్లుప్తంగా

ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): చేతివృత్తుల వారికి రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం కోసం ఈనెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీసీ, కులవృత్తులు, చేతివృత్తుల వారికి ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈమేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, జీవీఎస్.చౌదరి, మండే వీర హన్మంతరావు, రాంబాబు పాల్గొన్నారు.

మూడు రోజులు నీటి సరఫరా బంద్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కిన్నెరసాని మంచి నీటిని సరఫరా చేయు 800 సీఎస్సీ మొయిన్ పైపులైన్ రేగళ్ల మండలం ఎస్సీ కాలనీ వద్ద ఏర్పడిన లీకేజీలను సరి చేయుటకు గానూ పట్టణంలో 10వ తేదీ వరకు కిన్నెరసాని నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు గ్రహించి సహకరించాలని కోరారు.

నేడు సంక్షేమ సంబురాలు

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నియోజక వర్గ స్థాయి సంక్షేమ సంబురాలు స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సంక్షేమ విభాగాల అధికారులు హాజరై ఆయా శాఖలతో లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలను అందజేస్తారని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జూలూరుపాడు: ఈ నెల 9, 10వ తేదీల్లో కొత్తగూడెం కోర్టులో జరిగే మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పోటు గణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని వారిపై ఏమైనా డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉంటే కోర్టు వారు కొంత ఫైన్ కట్టించుకొని ఆ కేసును మూసి వేస్తారన్నారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రకాష్

పాల్వంచ: చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమని వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్ అన్నారు. స్థానిక శాస్త్రీ రోడ్డులో కొండ్లె రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి.మధు, హరి, రెడ్డి, శశి, రంజిత్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ

పాల్వంచ: వరంగల్ సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో పాల్వంచకు చెందిన శనగ రాంచందర్‌రావు కుమారుడు రాఘవేంద్ర ప్రథమ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థిని గురువారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివ్య ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని లీకేజీలు కనిపించడం లేదా?


మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: కిన్నెరసాని ప్రాజెక్టులో లీకేజీలు, ఇతర లోపాలతో కొత్తగూడెం నియోజక వర్గ ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే పట్టించుకోని ప్రజాప్రతినిధులు చెరువుల పండుగ జరుపుకోడం గర్హనీయమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. కొత్తగూడెంలో గురువారం జరిగిన సమావేశంలోఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో నెలకు 15 రోజులు కూడా కిన్నెరసాని నుంచి నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కిన్నెరసాని మంచినీటి పథకం ప్రారంభించింది మొదలు ఇప్పటివరకు లోపాలు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి చెనిగారపు నిరంజన్‌కుమార్, నాయకులు శరత్, రాహుల్, డింపు పాల్గొన్నారు.

అమరులను ఆదర్శంగా తీసుకోవాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్: తుది శ్వాస వరకూ ప్రజల కోసం పనిచేసిన అమరులను ఆదర్శంగా తీసుకుని ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని, పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి నారాయణరావుపేటలో ఇటీవల మృతిచెందిన సీపీఐ మండల మాజీ కార్యదర్శి దేవరకొండ నాగాచారి స్వగృహంలో గురువారం జరిగిన సంస్మరణ సభలో కూనంనేని పాల్గొని మాట్లాడారు. దేవరకొండ నాగచారి లేని లోటు కుటుంబానికే కాదు పార్టీకి తీరని లోటు అన్నారు. పార్టీ విస్తరణకోసం ఆయిన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా కార్యకవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి విసంశెట్టి పూర్ణచందర్ రావు, నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు, గుడిపూడిరాజు, రామకృష్ణ, ఎల్లంకి శివరావు, మేక రాంబాబు, సత్యనారాయణరెడ్డి, గుర్రం నాగయ్య, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి జాతర ప్రారంభం


అంకమ్మతల్లి అమ్మవారు

సుజాతనగర్: ఈ నెల 12 వరకు నిర్వహించనున్న అంకమ్మతల్లి జాతర మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో గురువారం ప్రారంభమైంది. తొలిరోజున మహాలక్ష్మీ, అంకమ్మతల్లి గద్దెలను సిద్ధం చేసి అమ్మవార్లను గద్దెలపైకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు కలశ స్థాపన, అంకురార్పణ తదితర ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

విద్యార్థుల తరలింపు సరికాదు


మాట్లాడుతున్న అభిమన్యు

ఇల్లెందు: గురుకులం తరహాలో ఆశ్రమ పాఠశాలల్లో సెక్షన్లు పెట్టి అదనపు విద్యార్థులను మరోచోటుకు తరలించడం సరైంది కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బయ్యా అభిమన్యు అన్నారు. గురువారం ఇల్లెందులో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటి వరకు గురుకుల పాఠశాలల్లోనే 45 మందితో ఒక సెక్షన్ ఉండేదని, ఇక మీదట గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కూడా అదే విధానం అమలు చేయాలని అధికారులు నిర్ణయించారన్నారు. ఇలాంటి నిర్ణయంవల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించలేక బడి మానేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కొన్ని పాఠశాలలకు రెండు సెక్షన్లకు అనుమతి ఇచ్చి సంఖ్య పెంచమని ఆదేశాలు ఇవ్వటం తగదన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రవీణ్, వెంకటేష్, కరుణాకర్ నాయకులు తదితరులు పాల్గొనారు.

తొమ్మిదేళ్లలో ప్రజాస్వామ్యం ఖూనీ


మాట్లాడుతున్న కిరణ్

ఇల్లెందురూరల్: సీఎంగా కేసీఆర్ తొమ్మిదేళ్ల తన పరిపాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ప్రజాపంథా జిల్లా నాయకులు బుర్ర వెంకన్న, ఆవుల కిరణ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను నిరసిస్తూ మండలంలోని బోయితండా గ్రామపంచాయతీలో ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, రుణమాఫీ, రేషన్‌కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల ఇళ్లు, దళితబంధు, తదితర అనేక హామీలను గాలికొదిలేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర రాఘవులు, ఇస్లావత్ కోటేష్, గుగులోత్ భద్రు, పాపన్న, సీత, హరిలాల్, తురామి, సిరి, బుల్లి తదితరులు పాల్గొన్నారు.

వేసవి తీవ్రత, 'మృగశిర' ఎఫెక్ట్


అలంకారప్రాయంగా మారిన సభావేదిక


ఖాళీగా ఉన్న కుర్చీలు

● ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు జనం కరువు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటుచేశారు. అయితే, వేసవి తీవ్రతకు తోడు మృగశిరకార్తె ప్రభావంతో ఆశించిన స్థాయిలో జనం హాజరు కాలేదు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరైతే ఫుడ్ ఫెస్టివల్ ప్రాధాన్యత, చేపలతో ఆరోగ్యానికి జరిగే మేలును వివరించాలని సభకు సైతం ఏర్పాట్లు చేశారు. కానీ అంచనాలు తారుమారు కావడంతో భారీగా ఏర్పాటు చేసిన సభావేదిక, కుర్చీలు అలంకార ప్రాయంగా మారగా, అనవసర వ్యయం అయినట్లయింది.

జేకేఓసీని సందర్శించిన సేఫ్టీ జీఎం


జేకేఓసీ పనిప్రదేశాన్ని పరిశీలిస్తున్న సేఫ్టీ జీఎం కుమారస్వామి, అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీని కొత్తగూడెం సేఫ్టీ జీఎం కుమారస్వామి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోజువారీ ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికి తీయటం వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్వారీ పని ప్రదేశాన్ని సందర్శించి అక్కడి పనులను పరిశీలించారు. ఆయన వెంట పీఓ బి.వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్‌రావు, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇంజనీర్ దేవేందర్‌నాయక్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్వార్టర్లను డబుల్ బెడ్‌రూంలుగా మార్చండి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి క్వార్టర్స్‌ను డబుల్ బెడ్ రూంలుగా మార్చి కార్మికులకు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య సింగరేణి అధికారులను కోరారు. గురువారం ఇల్లెందు ఏరియా ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇల్లెందు ఏరియాలో సుమారు 1,500 క్వారర్లు ఉన్నాయని, 645 మంది ఉద్యోగులు నివాసం ఉంటున్నారన్నారు. వందల క్వార్టర్స్ అన్యాక్రాంతం అవుతున్నాయని,. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. ఇల్లెందు ఏరియాలో శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను రెండింటిని కలిపి ఒక క్వార్టర్‌గా మార్చి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రమణ, ఎండీ. నజీర్ అహ్మద్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

శంకుస్థాపనకే పరిమితం..



టేకులపల్లి మండలం చంద్రుతండా పంచాయతీ గోప్యాతండా, రాజుతండా బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే హరిప్రియ కృషితో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరుకాగా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రెండు నెలలైనా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు నిర్మాణంపై స్థానిక ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వర్షాకాలంలో ఈ మార్గంలో ఇబ్బందికరంగా రాకపోకలు ఉంటాయి. అధికారులు స్పందించి వెంటనే బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : సయ్యద్ సలార్, ఏఈ ఐటీడీఏ, టేకులపల్లి
సెల్ నంబర్ : 9701619970

తెలంగాణలో నిండుకుండల్లా చెరువులు

● ఘనంగా చెరువుల పండుగ


సుజాతనగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా


పాల్వంచరూరల్: తోగ్గూడెంలో చెరువులో బతుకమ్మ సంబురాలు..

సుజాతనగర్: మిషన్ కాకతీయ పథకంతో చెరువుల పునరుద్ధరణతో ఆయకట్టుకు సాగునీరు సమృద్ధిగా అందుతుందని, దేశంలో కొన్నిచోట్ల చెరువులు ఎండిపోతున్నప్పటికీ తెలంగాణలో మాత్రం చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సింగభూపాలెం చెరువు ఆవరణలో 'ఊరూరా చెరువుల పండుగ' కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు బతుకమ్మలను తీసుకొని డీజే చప్పుళ్లతో కట్ట మైసమ్మ వద్దకు జాతరగా తరలివెళ్లి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ భాస్కర్, ఏఈ శ్యాంబాబు, ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా విజయలక్ష్మీ, ఆత్మ కమిటీ చైర్మెన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మలు, బోనాలతో గ్రామాల్లో మేళతాళాల నడుమ సామూహిక ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బతుకమ్మల చుట్టూ కోలాటం వేస్తూ ఆడి పాడి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం చెరువుల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షణాధికారి, కొత్తగూడెం సీఐ రాయల వెంకటేశ్వర్లు మండలంలో పర్యటించి, పరిశీలించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శారద, జూలూరుపాడు సీఐ జె వసంత కుమార్, ఎస్సై పోటు గణేష్, మండల స్పెషల్ ఆఫీసర్ తాళ్లూరి రవి, ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ భూక్యా కళావతి, వైస్ ఎంపీపీ గాదె నిర్మల, ఎంపీఓ పి.కృష్ణ, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ ఎదళ్లపల్లి వీరభద్రం, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, మండలాధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, సర్పంచ్ బానోత్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో ప్రజాప్రతినిధులు, మహిళలు, రైతులు బతుకమ్మలు, బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించి చెరువుకట్ట వద్దకు చేరుకుని కట్టమీద కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యంగా బోనాలు చెల్లించారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, అధికారులు ప్రజా ప్రతినిధులు, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: మండలంలోని రాంపురం,అంబేద్కర్ నగర్, పెనగడప,రుద్రంపూర్, 4 ఇంక్లైన్, విద్యానగర్ గ్రామపంచాయతీల్లోని చెరువుల వద్ద కట్ట మైసమ్మలకు పూజలు నిర్వహించారు. విద్యానగర్‌లోని చింతల చెరువులో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పూజలు చేశారు. ఎంపీపీ బాదావత్ శాంతి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత, ఎంపీడీఓ మంద మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఐబీ ఏఈ కిషోర్, తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్, ఉపాధి సిబ్బంది రఘుపతి, అనిల్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మండల పరిధిలోని 36 గ్రామపంచాయతీల్లో ఊరూరా చెరువుల వద్ద గ్రామీణ ప్రాంత ప్రజలు చెరువుల వద్దకు మహిళలు బతుకమ్మలను నెత్తిన ఎత్తుకుని చెరువు వద కట్టమైసమ్మదేవతలకు పూజలు చేసి బతుకమ్మలను ఆడి నిమజ్జనం చేశారు. అనంతరం సహపంక్తి భోజనాల కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాల్లో చెరువుల పండగ పనులను జెడ్పీ సీఈఓ విద్యాలత పరిశీలించారు. పండగ వేడుకల్లో తహసీల్దార్ రంగాప్రసాద్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీడీఓ బి.అప్పారావు, సీడీపీఓ కనకదుర్గ, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఎం రాంబాబు, ఏపీఓ రంగాల, సర్పంచ్ హరి, రాజా, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మల్లెల శ్రీరామ్మూర్తి, పాపారావులు పాల్గొన్నారు.


చుంచుపల్లి: విద్యానగర్‌లో..


ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెంలో కట్టమైసమ్మకు పూజ చేస్తున్న రైతులు, ప్రజాప్రతినిధులు


జూలూరుపాడు: అన్నారుపాడులో..


పాల్వంచరూరల్: సూరారంలో ..